

కథా కౌముది

అతి పెద్ద శిక్ష

అ.కిశోర్

"కైలాసం గారూ, కైలాసం గారూ, డాక్టరు గారొచ్చారు, కళ్లు తెరవండి" తన శరీరాన్ని కుదుపుతూ వచ్చిన ఆ పిలుపుకి హాస్పిటల్ పడక మీద మగత నిద్రలోనున్న కైలాసానికి మెలకువ వచ్చింది. మెల్లగా కళ్లు తెరిచాడు.

తన పడకకు ఒకవైపు డాక్టరు గారూ, నర్సూ, రెండోవైపు తన భార్య పార్వతి ఉన్నారు. డాక్టరు గారికి నమస్కారం చెయ్యాలనిపించింది కైలాసానికి. కానీ చేతులు సహకరించడం లేదు. మర్యాద పూర్వకంగా లేచి కూర్చోవాలనిపించింది. కానీ నడుము సహకరించడం లేదు. కనీసం నోటితో నమస్కారం చెప్పాలనిపించింది. స్వరపేటిక నుండి అస్పష్టమైన శబ్దాలు మాత్రమే వచ్చాయి. తన నిస్సహాయతకు చాలా అసహనంగా ఉంది. కానీ ఏమీ చెయ్యలేని అశక్తత!! భగవంతుడా, ఇంకెన్నాళ్లు నాకీ శిక్ష? మనసులోనే అనుకుంటూ శూన్యంగా పైన తిరుగుతున్న సీలింగ్ ఫ్యాన్ ని చూస్తూ మౌనంగా ఉండిపోయాడు.

రొటీన్ పరీక్షలు నిర్వహించి "అన్నం తినిపించమ్మా. బాగా నీరసంగా ఉన్నాడు" అని తన భార్యతో చెప్పి డాక్టరు గారు వెళ్ళిపోయారు. ఆయన వెనకే నర్సు కూడా వెళ్ళిపోయింది.

సుమారు నెల రోజులుగా ఇదే పరిస్థితి. కైలాసం స్వతహాగా చాలా దుడుకు మనిషి. ఒక్క చోట స్థిరంగా ఉండేవాడు కాదు. సరైన ఉద్యోగం లేకపోయినా అడ్డమైన పనులూ చేస్తూ ఎంతో కొంత సంపాదించుకునేవాడు. కానీ అతడి సంపాదనంతా అతడి తాగుడు, పేకాట, మిగతా విలాసాలకే సరిపోయేది కాదు. కుటుంబ పోషణకోసం పార్వతి ఉద్యోగం చెయ్యవలసి వచ్చింది. ఉద్యోగం, పిల్లల బాధ్యతతో పాటు బయటి సమాజంలో కైలాసం ప్రవర్తన ఆమెను చాలా ఖేదపరచింది. అయినా సహిస్తూనే వచ్చింది. కైలాసానికి కుటుంబ బాధ్యతలు

పట్టకపోగా ఇంట్లో ఉన్న కొద్ది పాటి సమయంలో భార్య పట్ల, పిల్లల పట్ల అనుచితంగా ప్రవర్తించే వాడు. అతడి ప్రవర్తనకు పార్వతితో సహా అందరూ విసిగిపోయారు.

ఓ నెల్లాళ్ల క్రితం ఓ రోజు బాగా తాగిన మత్తులో వీధిలో ఎవరితోనో గొడవ పడి, కొట్టడానికి ఆవేశంగా మీదికి దూసుకెళ్లాడు. ఆ ఆవేశంలోనే పక్షవాతం బారిన పడ్డాడు. శరీరం సహకరించక అక్కడే కూలబడ్డాడు. ఎవరిద్వారానో విషయం తెలుసుకుని అక్కడికెళ్లిన పార్వతి అతణ్ని ఆటోలో తీసుకువెళ్లి హాస్పిటల్లో చేర్పించింది. అప్పటినుండి ఇదే పరిస్థితి. ఎడమవైపు కాలూ చెయ్యీ పూర్తిగా ఆధీనంలో లేవు. కుడివైపు కొద్దిగా కదులుతున్నాయి. నోట మాట రావడం లేదు. అతడి ప్రవర్తనకు అప్పటికే పూర్తిగా విసిగిపోయిన పిల్లలు కూడా దగ్గరకి చేరడానికి ఇష్టపడడం లేదు. పార్వతి మాత్రం అసహనంగానే ఉన్నప్పటికీ అతణ్ని చూసుకుంటోంది.

పార్వతి తను ఇంటినుండి తీసుకు వచ్చిన భోజనం పళ్లెంలో వడ్డించి ఒక్కో ముద్ద కైలాసానికి తినిపిస్తోంది. ఆమె చేతి గోరు ముద్దలు నోట్లో పెట్టినా తినడానికి కూడా కైలాసానికి కష్టంగానే ఉంది ఓ పక్క నోట్లో కండరాలు సహకరించక, మరో పక్క మనోవ్యధతో.

'పార్వతి ... ఎంత మంచిది! ఏమిచ్చాడు తను ఆమెకు? ఒక్క నాడూ సరిగ్గా చూసుకోలేదు సరికదా నానా విధాలుగా బాధ పెట్టాడు. అయినా ఆమె ఈరోజు తనకు సేవలు చేస్తోంది!' బాధగా ఉందతడికి. తాను తప్పు చేశాడు. ఆ విషయం తెలుసుకున్నాడు తను. కానీ అప్పటికే ఆలస్యం అయిపోయింది. నోరారా పార్వతిని ఆదరంగా అభిమానంతో అనురాగం కలబోసి పిలవాలని ఉంది. 'నేను తప్పు చేశాను, నా తప్పు నేను తెలుసుకున్నాను, నన్ను మన్నించమ'ని అడగాలని ఉంది. కానీ పెదవి దాటి మాట బయటకు రావడం లేదు. తన అశక్తతకు బాధ పడుతూ కంటినుండి అశ్రువులు ధారగా కారుతున్నాయి. ఎడమ చేత్తో పళ్లెం పట్టుకుని కుడిచేత్తో అతనికి తినిపిస్తున్న పార్వతి తన కుడిచేతి చీలమండతో అతడి కళ్లు తుడుస్తోంది.

ఆమె మనసులో సందిగ్ధత!! ఇన్నాళ్లు ఎంత దురుసుగా ప్రవర్తించాడు?? తన దురుసుతనంతో అందరికీ దూరమయ్యాడు! అన్నీ కోల్పోయాక ఈ రోజు వాస్తవం గ్రహించినట్టుంది. తనను కూడా ఎంత క్షోభ పెట్టాడు??!! ఆర్థికంగా కానీ, సాంఘికంగా కానీ ఏనాడూ తమనెవరినీ సుఖపెట్టలేదు సరికదా కనీసం అతడున్నాడనే ధీమా కూడా కలగజేయలేదు. పైపెచ్చు అతడు బయట చేసిన అప్పులు తీర్చాల్సిరావడమే కాకుండా అప్పుల వారి దృష్టిలో తానూ బిడ్డలూ చులకనైపోయారు. ఇలాంటి వ్యక్తికి తాను సేవలందించడం అవసరమా? ఉన్నపళంగా వదిలేసి వెళ్లిపోయినా తప్పులేదు.

కానీ మరోపక్క అందుకు తన మనసు అంగీకరించడం లేదు. అతడికి బుద్ధి లేదు సరే, తన సంస్కారం ఏమైంది? తను కూడా అతడిలా బాధ్యతారహితంగా ప్రవర్తిస్తే ఇంక తేడా ఏముంది?? స్త్రీమూర్తి సహజ గుణమైన సహనం ఆమెలో అతడిపట్ల ఉన్న తృణీకార భావాన్ని అధిగమించింది.

పిల్లలు వద్దని వారిస్తున్నా వినకుండా ఆమె కైలాసానికి సేవలందించి అతడు కోలుకోవడానికి సహకరించింది.

కొంత కాలానికి కైలాసానికి ఆరోగ్యం కుదుటపడడంతో హాస్పిటల్ నుండి డిశ్చార్జి చేశారు.

ఇంటికి చేరుకున్న కైలాసాన్ని అపరాధభావం కృంగదీస్తోంది. తన కారణంగా పార్వతికి, పిల్లలకు జరిగిన అవమానాలకు, వారి జీవితాల్లో లోపించిన ఆత్మ విశ్వాసానికి ప్రాయశ్చిత్తం చేసుకోవాలని ఉంది. ఇన్నాళ్ల అనారోగ్యం కారణంగా తనకున్న వ్యసనాలకు క్రమంగా దూరమైనందుకు ఓ పక్క సంతోషంగానే ఉన్నా, పూర్తి స్థాయిలో మనశ్శాంతి కలగడం లేదు.

ఓరోజు సాయంత్రం కైలాసం కుర్చీలో కూర్చుని శూన్యం లోకి చూస్తున్నాడు. పార్వతి కప్పులో వేడిగా టీ అందించింది. టీ కప్పు అందుకుంటూ ఆర్ద్రత నిండిన కంఠంతో ఆమెతో అన్నాడు ... ... "చేసిన తప్పులకు మనిషికి భగవంతుడిచ్చే అతి పెద్ద శిక్ష ఏమిటో తెలుసా పార్వతీ?"

చిరునవ్వుతో వ్యంగ్యంగా ఆమె అంది ... ... "వ్యసనాలకు దూరం చెయ్యడమా?"

"కాదు పార్వతీ. చేసిన తప్పులు తెలుసుకుని మనసు పశ్చాత్తాపంతో కుమిలిపోతున్నప్పుడు ఆ పశ్చాత్తాపాన్ని బయటకు తెలియపరచలేక పోవడం. మనసారా నన్ను క్షమించమని అడగలేక పోవడం! హాస్పిటల్ లో ఉన్నన్ని రోజులూ నా ప్రవర్తనను నేనే సమర్థించుకోలేక, నాపై నాకే కలిగిన అసహ్యాన్ని వ్యక్తపరచలేక, నన్ను క్షమించమని ప్రాధేయపడలేక, కాళ్లూ చేతులూ సహకరించక, నోటి వెంట మాటరాక, ప్రాణం పోక ... ... నరకయాతన అనుభవించాను పార్వతీ. గతంలో నీ పట్లా పిల్లల పట్లా నా ప్రవర్తనకు సిగ్గు పడుతున్నాను. నన్ను క్షమించగలిగే గొప్ప మనసు నీకుంది కాబట్టే నాలాంటి మూర్ఖుడికి సేవలు చేసి మామూలు మనిషిని చేశావు. ఏమిచ్చి నీ ఋణం తీర్చుకోగలను? నన్ను క్షమించు పార్వతీ" అంటూ అమాంతం ఆమె కాళ్లపై పడ్డాడు.

"అయ్యో అయ్యో లేవండి" అంటూ అతడిని పైకిలేపి అపరాధం జరిగినట్టు తన తాళిబొట్టును రెండు కళ్లకూ అద్దుకుంది. ఆ సమయంలో ఆనందమో దుఃఖమో తెలియని ఓ అనిర్వచనీయమైన అనుభూతితో ఆమె కళ్లు నుండి అశృధారలు కారాయి.

లోపలి గదిలోనుండి ఈ దృశ్యాన్ని గమనిస్తున్న పిల్లలు అప్రయత్నంగా కళ్లు తుడుచుకున్నారు.

COMMENTS